**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ**
**తేదీ : మే 12, 2016**

**శ్రీయుత నారా చంద్రబాబు నాయుడు గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయం :** **రాజధాని ప్రాంతంలో కార్మిక చట్టాల అమలును ఆటంక పరిచేవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ...**

రాజధాని నిర్మాణ పనుల్లో రేయింబవళ్ళు కష్టపడి పనిచేస్తున్న కార్మికుల భద్రత, సంక్షేమానికి సంబంధించిన చట్టాలు అమలు కాకపోవడం శోచనీయం. తాత్కాలిక సచివాలయం నిర్మాణ పనుల్లో రెండు నెలల వ్యవధిలోనే ఇద్దరు కార్మికులు మృతి చెందడం, ఆ సందర్భంలో ఎక్స్‌గ్రేషియా చెల్లింపుపై కార్మికులు తీవ్ర ఆందోళన చేయాల్సి వచ్చింది. కార్మిక చట్టాలు, ప్రభుత్వం ప్రకటించిన పథకాలు వర్తింపచేసివుంటే అలాంటి దుస్థితి సంభవించేది కాదు.

పనిలో ఉన్న కార్మికుల పేర్లు నమోదు, సంబంధిత రుసుము, ప్రీమియంలను ప్రభుత్వానికి కాంట్రాక్టర్లు జమ చేయకపోవడం వల్ల ప్రాథమికమైన ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ వంటివి కూడా కార్మికులకు లభించడం లేదు. మే 10న మరణించిన దేవేందర్ అనే కార్మికుని పేరిట పిఎఫ్, ఇఎస్ఐ నమోదు చేసి, యాజమాన్యం స్వల్ప మొత్తం ప్రీమియం చెల్లించి ఉంటే అతని కుటుంబ సభ్యులకు జీవితాంతం నెలకు రు.8,000/-లు పింఛనుగా లభించి ఉండేది. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఆ కార్మికుని కుటుంబానికి తీవ్ర నష్టం జరిగింది. ఇటువంటి పరిస్థితి ఇంకెవ్వరికీ ఎదురు కాకుండా తగు చర్యలను తీసుకోవాలి. కార్మికులకు భద్రతాపరమైన పరిజ్ఞానాన్ని అందించాలని కార్మిక శాఖ అధికార్లు ప్రయత్నించినా సచివాలయ నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టు సంస్థ అంగీకరించలేదన్న విషయం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. కాంట్రాక్టరు చర్య చట్ట ఉల్లంఘనే అవుతుంది. సాక్షాత్తూ రాష్ట్ర రాజధానిలోనే ప్రభుత్వాధికార్లపై కాంట్రాక్టు సంస్థ పెత్తనం చలాయించి చట్టాన్ని అమలు కానీయకుండా చేస్తుందంటే ఇక రాష్ట్రమంతటా కార్మిక చట్టాల అమలు ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు చట్టాన్ని అమలు చేయ ప్రయత్నించినప్పుడు ఆటంకపరిచే కాంట్రాక్టు సంస్థలు, ప్రైవేటు యాజమాన్యాలు, వాటి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే అలాంటివి పునరావృతం కావు.

మీరు ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని కార్మిక చట్టాలు తప్పనిసరిగా అమలు జరిగేలా సంబంధిత శాఖలను ఆదేశించవలసిందిగా కోరుతున్నాము. పనిలో ఉన్న కార్మికులందరికీ – దినసరి లేదా కాంట్రాక్టు లేదా ఇంకే ప్రాతిపదికనైనా పని చేస్తున్న వారికి – కార్మిక చట్టాల ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ, ఇతర సంక్షేమ పథకాలు అన్నింటినీ వర్తింపజేయాలి. ఎలాంటి మినహాయింపులు లేకుండా కార్మికులందరికీ ఇవి లభించేలా ప్రభుత్వాధికారులను ఆదేశించాలని కోరుతున్నాను. ప్రైవేటు యాజమాన్యాలు – వారు ఎంత శక్తివంతులైనప్పటికీ – ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను విధి నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి